


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

బుధవారం। 17 సెప్టెంబరు 2025

పేజీలు 8


# డిఎస్‌సి తుది జాబితా పై అభ్యర్థులకు అనుమానాలు

- మెరిట్ మార్కులు సాధించిన పోస్టులు రాలేదని అభ్యర్థుల ఆవేదన
- జిల్లాలో 2590 పోస్టుల భర్తీ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఏపి మెగా డిఎస్‌సి 2025 నియమ ప్రక్రియలో భాగంగా జాబితా వచ్చేసింది. ఈ జాబితాలను ఆన్‌లైన్‌తో పాటు డిఈఓ కార్యాలయం ముందు ప్రదర్శించారు. దీంతో ప్రభుత్వం ప్రచురించిన చివరి జాబితా లో తమ పేర్లు ఉన్నాయో లేదో అని కర్నూలు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల నుంచి అభ్యర్థులు తరలివచ్చారు. ఆ తర్వాత జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో మెగా డిఎస్‌సిలో తాము నష్టపోయామని భావించిన అభ్యర్థులు డిఈఓ కార్యాలయంను సంప్రదించారు. ప్రచురించిన జాబితాపై చాలా అనుమానాలు ఉన్నాయని పోస్టులు దక్కని అభ్యర్థులు కర్నూలు విద్యా శాఖ కార్యాలయంలో విద్యా శాఖ అధికారి శామ్యూల్‌పాల్‌ను నిలదీశారు. తమ అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. దీంతో కార్యాలయంలో కొంతసేపు గందర గోళం నెలకొంది. ముఖ్యంగా ర్యాంకు, మార్కుల పరంగా అర్హత ఉన్న తమకు అన్యాయం జరిగిందంటూ అధికారులకు మొర పెట్టుకున్నారు. పిఈటీ, ఇతర కేటగిరిలతో పాటు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారి సర్టిఫికేట్లు సమగ్రంగా విచారించ లేదని ఆరోపించారు.

మిగతా 2లో



డిఈఓను నిలదీస్తున్న అభ్యర్థులు

## మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత

- దేవాలయాలు ,కోనేరులు ,బావులు పరిశుభ్రం చేస్తున్న శివ కుమార్ రెడ్డి టీం
- ఐదు సంవత్సరాలుగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతూ సమాజ సేవలో తరిస్తూ..
- 1500 -2000 సభ్యులు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మన ఊరు మన గుడి మన బాధ్యత అంటూ సమాజ సేవలో తరిస్తూ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ ముందుకు సాగుతున్నారు. నంద్యాల శివకుమార్ రెడ్డి టీం. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌గా పనిచేస్తున్న శివకమార్ రెడ్డి ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావు చెప్పిన ప్రవచనాలను స్ఫూర్తిగా తీసుకొని

మిగతా 2లో



నంద్యాల శివకుమార్ రెడ్డి





## నిండుకుండలా శ్రీశైలం జలాశయం

- డ్యాం నాలుగు గేట్లు ఎత్తివేత
- ఇన్ ఫ్లో 1,57,449 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 1,77,259 క్యూసెక్కులు
- ఈ ఏడాదిలో ఏడవ సారి డ్యాం గేట్ల ఎత్తివేత

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలానికి వరద నీరు భారీగా చేరుతోంది. జలాశయం నిండుకుండను తలపిస్తుండటంతో మంగళవారం ఉదయం 8.15గంటలకు డ్యాం 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నాగార్జునసాగర్కు నీటిని విడుదలను ప్రారంభించారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవటంతోపాటు వరద ప్రవాహం కొనసాగడంతో మధ్యాహ్నం మరొక గేటును, రాత్రి 9 గంటల సమయంలో ఇంకొక గేటును ఎత్తి మొత్తం నాలుగు గేట్ల ద్వారా 1,11,200 క్యూసెక్కులు, రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 66,059 క్యూసెక్కులు మొత్తంగా 1,77,259 క్యూసెక్కుల నీటినినాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. జూరాల, తుంగభద్ర, హంద్రీ ప్రాజెక్టు ద్వారా శ్రీశైల జలాశయానికి 1,44,362 క్యూసెక్కుల

మిగతా 2లో



గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదలవుతున్న దృశ్యం

## కర్నూలు పత్తికి బ్రాండ్ ఇమేజీను క్రియేట్ చేసుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవ్య చిత్రంలో జెడిఏ వరలక్ష్మి

## శ్రీ మఠం హుండీ ఆదాయం లెక్కింపు

- హుండీ ఆదాయం నగదు రూ.3.5 కోట్లు
- బంగారం 138 గ్రాములు,వెండి 950 గ్రాములు




హుండీ ఆదాయం లెక్కిస్తున్న మఠం అధికారులు

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..!

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండల పరిధిలోని బూరందొడ్డి గ్రామానికి చెందిన హరిజన పిలిప్ అనే రైతు అప్పుల బాధ తాళలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సమాచారం మేరకు తల్లిదండ్రుల నుండి వరసత్వంగా సంక్రమించిన రెండు ఎకరాల పొలంతో పాటు, మరో 5ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, తదితర పంటలను సాగు చేస్తున్నారు. మూడు సంవత్సరాల నుంచి పంటలు చేతికి రాక పోవడంతో దాదాపు 7లక్షల వరకుపెట్టుబడికి చేసిన అప్పులు మిగిలాయి.

మిగతా 2లో



పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న పీలిప్

సూర్య www.suryaa.com



## డిఎస్‌సి తుది జాబితాపై అభ్యర్థులకు అనుమానాలు

(మొదటి పేజి తరువాయి)

ఈడబ్ల్యూస్, పిహెచ్ కేటగిరీల్లో అనర్హులకు అందలం ఎక్కించారన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో 49పోస్టులను చూపి, కేవలం 43పోస్టులను మాత్రమే భర్తీ చేశారని అభ్యర్థులు నిలదీశారు. మిగిలిన 6పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని అడిగితే 49పోస్టులు భర్తీ చేయాలని పంపిన తమకు ఏపి శాప్ నుంచి 43మంది జాబితా మాత్రమే వచ్చిందని, ఆ మేరకు రోస్టర్ పాయింట్లు ప్రకటించిన తర్వాత ఆ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు.

**తుదిజాబితాలో 2590మంది ఎంపిక :** రాష్ట్ర విద్యా శాఖ అధికారులు సోమవారం ప్రచురించిన మెగా డిఎస్సీ తుది జాబితాలో 2590మంది ఎంపికైనట్లు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా వివిధ కేడర్‌లలో 2678పోస్టులకు డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ప్రక్రియ తుది జాబితా ప్రచురణ నాటికి పలు కేడర్‌లలో 2590మంది అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. 88పోస్టులకు అభ్యర్థులు లేరని ప్రకటించారు. తుది ఎంపిక జాబితాలను కలెక్టరేట్, డిఈఓ కార్యాలయ నోటీసు బోర్డులలో ప్రచురించారు. తుది జాబితాలో అభ్యర్థులకు ఎవరైనా అభ్యంతరాలున్నట్లైతే కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నెంబర్‌లో తెలియజేయాలని డిఈఓ శామ్యూల్‌పాల్ తెలిపారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..!

(మొదటి పేజి తరువాయి)

అప్పులభారం పెరిగి ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపరన్నారు.మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు,భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు కోరుచున్నారు.

# నిండుకుండలా శ్రీశైలం జలాశయం

**నిండుకుండలా శ్రీశైలం జలాశయం**

వరద నీరు వచ్చి చేరింది.మంగళవారం రాత్రి 9 గంటల సమయానికి డ్యామ్ నీటిమట్టం 884.40 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 211.9572 టీఎంసీలుగా నమోదైంది.కాగా జలా శయం బ్యాక్ వాటర్ ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కు 8 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ ఎస్కు 2,434 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.అలాగే గడిచిన 24 గంటల విడుదల కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 31,036 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 15.538 మిలియన్ యూనిట్లు,ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39,574 క్యూసెక్కుల నీటితో 17.060 మిలియన్ యూనిట్ల విద్యుత్ను ఉత్పత్తి చేశారు.ఈ ఏడాది 7వసారి డ్యాం గేట్లను ఓపెన్ చేసి సాగర్కు నీటి విడుదల చేస్తున్నారు.వరద ప్రవాహం పెరిగితే మరి రెండు గేట్లను ఎత్తివేస్తామని,ప్రవాహం తగ్గితే గేట్లను మూసివేస్తామని అధికారులు తెలిపారు.

# శ్రీ మఠం హుండీ ఆదాయం లెక్కింపు

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు మఠం మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగదు రూ.3,50,171లు, బంగారం 138 గ్రాములు, వెండి 950గ్రాములు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. 27 రోజులకు ఈ ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి




గోనెగండ్లలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** రెగ్యులర్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ జేఏసీ సంఘం నాయకులు రాయచోటి స్వామి, రంగ స్వామి, మురళి డిమాండ్ చేశారు. గోనెగండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర మంగళవారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి సంఘం నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వంస్పందించి శాశ్విత ఉద్యోగుల గా గుర్తించాలని డిఏలు సక్రమంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అనిల్, మహబుబాబాషా పాల్గొన్నారు.

## ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించిన పోలీసులు

**హొళగుంద,మేజర్‌న్యూస్ః** హొళగుంద మండలంలోని నెరణికి తాండ గ్రామంలో ప్రజలకు పోలీసులు మంగళవారం అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహంచారు.ఆలూరు సిఐ రవిశంకరేరెడ్డి,ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు మాట్లాడుతు వచ్చే నెల 2వ తేదిన దేవరగట్టు విజయదశమి



నెరణికి తాండలో ప్రజలతో మాట్లాడుతున్న సిఐ,ఎస్‌లు

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు నాటు సారాకు స్వస్తి పలకాలన్నారు.ఆటవి కోండ ప్రాంతంలో దాడులు నిర్వహించగా 70 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు.సారాను తయారు చేయడం,విక్రయించడం నేరమన్నారు.ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలంటే సారాను విక్రయించరాదని చెప్పారు.ఆదేవిధంగా సైబర్ నేరగాళ్ళపై అప్రమత్తంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు,పోలీసు సిబ్బంది పాల్గోన్నారు.

# మన ఊరు.. మన గుడి.. మన బాధ్యత

(మొదటి పేజి తరువాయి)





మన ఊరు మన గుడి మన బాధ్యత అనే కార్యక్రమం ద్వారా దేవాలయాలు ,కోనేరు, బావులను పరిశుభ్రం చేస్తూ ముందుకు సాగుతున్నారు. 2021 మే 12న ప్రథమ నందీశ్వరాలయంలో 13 మందితో చేపట్టిన మహత్తర కార్యక్రమం నేడు 1500 నుండి 2000 మంది స్వచ్ఛంద వాలంటీర్ల ద్వారా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు 250 ఆలయాల్లో కోనేరు, బావులను పరిశుభ్రం చేయడం జరిగిందని శివకుమార్ రెడ్డి మంగళవారం మేజర్ న్యూస్ తో తెలిపారు. కసాపురం,అహోబిలం, శ్రీశైలం, వారణాసి మహానంది, నవనంది ఆలయాలు, యాగంటి, పేరు స్వాముల లోని చెన్నకేశవ స్వామి ఆలయం ఇంకా ప్రఖ్యాత ఆలయాల లోని కోనేరు బావులను పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు. మొదట ఈ కార్యక్రమం చేపట్టినప్పుడు స్వచ్ఛందంగా మేమే గుడిలో దగ్గరికి వెళ్లి ఆలయ కార్య నిర్వాణా అధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్యక్రమాలు చేపట్టడం జరిగేదన్నారు. ప్రారంభ దశలో మేమే మా సొంత డబ్బులతో భోజనంత యారు చేసుకునే వాళ్ళమన్నారు. మేము చేస్తున్న పనులను చూసి చాలామంది ఆకర్షితులై స్వచ్ఛందంగా తామే వాలంటీర్లుగా ముందుకు రావడం చాలా సంతోషదాయకం అన్నారు. ప్రస్తుతం ఏ ఆలయానికి వెళ్ళిన సంబంధిత నిర్వాహకులే తమకు భోజన సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. మా సేవా కార్యక్రమాల్లో డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగస్తులు తో పాటు కూలి పనులు తయారు



చేసుకునేవారు కూడా ఉన్నా రన్నారు. మా టీమ్ అంతా ఒక కుటుంబ సభ్యుల మాదిరికలిసిమెలిసి ఉంటామని వారింట్లో ఏదైనా శుభకార్యాలు జరిగినప్పుడు తాము కూడా వాలంటీర్‌గా వెళ్లి సేవలు చేయడం జరుగుతుందని శివ కుమార్‌రెడ్డి తెలిపారు. శివానుగ్రహంతోనే మేము ఈ కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లోని చిన్నచిన్న ఆలయా ల వారు కూడా తమ ఆహ్వానిస్తే అక్కడ పరిసరాలను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు.

# కర్నూలు పత్తికి బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకోవాలి

**ః– గుంటూరు మిర్చి ఎలా ఫేమసో..మన కర్నూలు పత్తి కూడా అలా ఫేమస్ కావాలిః– జిల్లాలో 67శాతం పత్తి పంట సాగు**

**ః– జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య**

**కోడుమూరు,మేజర్‌న్యూస్ ః** గుంటూరు మిర్చి పంటకు ఎలా బ్రాండ్ ఇమేజ్ ఉందో..మన కర్నూలు పత్తి పంటకు..అలాగే ఇమేజ్ క్రియేట్ చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.బి నవ్య పేర్కొన్నారు. కోడుమూరులో మారి(బెటర్ కాటన్), నాబార్డ్ ఆద్వర్యంలో పత్తి రైతులకు స్నేహ కళ్యాణ మండపంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జెసి నవ్య మాట్లాడుతూ కర్నూలు పత్తికి జాతీయ స్థాయిలో మంచి మార్కెట్ ఉందని దానికి అనుగుణంగా నాణ్యమైన పత్తిని పండించాలన్నారు. జిల్లాలో 67శాతం వ్యవసాయ భూముల్లో పత్తి పంటను అత్యధికంగా పండిస్తున్నారని తెలిపా రు. నాణ్యమైన పత్తి పంటతో పాటు అధిక దిగుబడి ఎలా సాధించాలనే దానిపై వ్యవసాయ అధికారుల తో పాటు అనేక స్వచ్ఛంధ సంస్థలు రైతులకు అవగాహన కల్పించడం శుభపరిణామమన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ పంటలకు పరిమితికి మించి రసాయన, క్రిమిసంహారక మందులు వాడుతున్నారని ఇది మంచి పరిణామం కాదన్నారు. పర్యావరణాన్ని కాపాడి.. భవిష్యత్తు తరాలకు..ప్రకృతి వనరులను అందించాలన్నారు. ఒకే రకం పంటలు కాకుండా రకరకాల పంటలు వేస్తే మంచి ధరలు లభిస్తాయని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సస్యరక్షణ పద్దతులు చేపట్టాలని రైతులకు ఆమె



రైతులకు పిచికారి కిట్లను పంపిణీ చేస్తున్న జెసి, జెడిఏ

సూచించారు. కెవికె కోఆర్డినేటర్, బనవాసి శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువులు వాడడం ద్వారా అప్పటికి బాగానే ఉన్నా భవిష్యత్తులో భూమి సాంద్రత కోల్పోయి పంటలు పండకుండా భూములు నిస్సారవంతమవుతాయన్నారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునిక పద్దతుల వైపు రైతులు మారారని అలాకాకుండా సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల భవిష్యత్తు తరాలకు మంచి చేసిన వారవుతామన్నారు. రైతులు క్రిమిసంహారక మందులు పిచికారి చేసేటప్పుడు రక్షణ చర్యలు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు పిచికారి కిట్లను పంపిణీ చేశారు. అలాగే సేంద్రీయ ఎరువులను జెసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జెడిఏ వరలక్ష్మి, నాబార్డ్ డిజిఎం ఎన్‌సీ సుబ్బారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ చంద్రరావు, మారి ఈడి మురళీ, ఏడిఎ శ్రీవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ నాగరాజు, ఏఓ రవి ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి రకీబ్ మృతి బాధాకరం

**ః– రకీబ్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడిన జిల్లా కలెక్టర్**

**ః– ఘటనపై విచారణకు ఆదేశించాం**

**ః– జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ ః** జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల యాజమాన్య పరిధిలోని శిథిలావస్థకు చేరుకున్న స్కూల్‌లపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం నగరంలోని కావడివీధి ఉన్న కీర్తి హైస్కూల్ ఘటన జరిగిన ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి డిఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ కీర్తి స్కూల్‌పైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అక్కడ నుండి కీర్తి పాఠశాలలో మృతిచెందిన విద్యార్థి రకీబ్ తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. మృతిచెందిన ఘటనపై ఇప్పటికే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలనుగుణంగా జిల్లాలోని స్కూల్స్ అన్నింటిని నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. పాతబడిన స్కూల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం డిఈఓ జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి ఇవ్వగా కలెక్టర్ డా.ఏ సిరి రకీబ్ తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ధైర్యంగా ఉండాలని కలెక్టర్ హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇంటి స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.



# సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలి

**– జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి**




మాట్లాడుతున్న జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులపై కాకుండా సొంత దాయ వనరులను పెంచుకోవాలని జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా వనరుల కేంద్రంలో ఎంపిడిఓలకు జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డి ఆద్వర్యంలో రెండురోజుల టీఓటి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణనుద్దేశించి జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి నెల గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెల్లింపులకు సొంత ఆదాయ వనరులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అందుకే గ్రామాల్లో జరిగే ఉత్సవాల సమయాల్లో ఏర్పాటు చేసే వ్యాపార దుకాణాలు, బస్టాండ్ ప్రదేశం, ఖాళీ ప్రదేశాల్లో షాపులను ఏర్పాటు చేసి సొంత ఆదాయం పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు స్వయం ప్రతిపత్తిని సాధించాలంటే ప్రత్యేకంగా మన రాయలసీమలాంటి వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధిలో ముందుకు సాగాలంటే సొంత ఆదాయ వనరులు ఎంతైనా అవసరమన్నారు. తాగునీటి సదుపాయాలను గ్రామంలో మెరుగుపరచడం కోసం నీటిపన్ను వసూలుకు కృషి చేయాలన్నారు. అవకాశం ఉన్న చోట కొత్త ఆవిష్కరణలు చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి జి బాస్కర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వనరులతో పాటు ప్రజలకు కావాల్సిన సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదేనన్నారు. అందుకు అవసరమైన ఆర్థిక వనరులు పెంచుకోవాలన్నారు. ప్రజలు సులభంగా, సౌకర్యవంతంగా పన్నులు చెల్లించుటకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు పారదర్శకతతో పాటు జవాబుదారీతనం, ఆర్థిక నిర్వహణ, సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా కృషి చేయాలన్నారు. డిప్యూటీ సిఈఓ వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆస్తులైన గ్రామ పంచాయతీలలో తమ పరిధిలోని ఆస్తుల ద్వారా, వ్యాపార ప్రకటనల ద్వారా సొంత ఆదాయ వనరును సమకూర్చుకోవచ్చని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలోడిపిఆర్‌సి కోఆర్డినేటర్ గంగాధర్, డిపిఆర్‌సి ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టిఓటిలుగా వి జేమ్స్ కృపవరం, అష్రఫ్‌బాషా, పి జగన్నాథం పాల్గొన్నారు.

## డీఎస్సీలో ప్రతిభ చాటిన కనుమక్రింది కొట్టాల గ్రామ యువతి

### గ్రామంలో మొదటిసారిగా టీచర్‌గా ఎంపిక



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచర్ల మండల పరిధిలోని కనుమ కింది కొట్టాల గ్రామనికి చెందిన కోడుమూరు మాదన్న లక్ష్మీదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు కలరు. రెండవ కుమార్తె కోడుమూరు ఇంద్రజ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో 75.09 మార్కులతో సెకండరీ గ్రేడ్ టీచర్ గా ఉద్యోగం సాధించింది.మారుమూల గ్రామమైన కనుమకింది కొట్టాల గ్రామంలో ఇప్పటివరకు టీచర్ ఉద్యోగం ఎవరు సాధించలేదు. ఉద్యోగం సాధించిన కోడుమూరు ఇంద్రజను గ్రామస్థులు, బంధుమిత్రులు అభినందించారు.తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివించారని వారి ఆకాంక్షలను నేరవేర్చనని మొదటిసారి వ్రాసిన డీఎస్సిలోనే ఉద్యోగం సాధించడం జీవితంలో సంతోకరమైన విషయమని అన్నారు.

## రైతులు త్వరగా పంట నమోదు చేసుకోండి



**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** ఖరీఫ్ 2025 న సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేయుటకు సెప్టెంబర్ 30 వ తారీకు చివరి తేదీ అని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచిం చారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాల యం నందు రైతు సేవా కేంద్ర సిబ్బందికి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రతి సర్వే నెంబరు ల్యాండ్ పార్సల్ పంట నమోదు చేయాలని సిబ్బందిని ఏఓ సూ చించారు. అలాగే నానో ఎరువులైనా నానో డీఏపీ నానో యూరియా ఉపయోగాలు, జీవన ఎరువులు వినియోగంపై సిబ్బందికి ఏఓ అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా నానో ఎరువుల వినియోగం అలాగే అతిగా యూరియా వాడకం వల న కలుగు నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించాలని, తదుపరి రైతు సేవ కేంద్రం ద్వారా ఎరువుల పంపిణీ కార్యక్రమం కార్యచరణ ప్రణాళిక ద్వారా పకడ్బందీగా ముందస్తుగా టోకెన్లు జారీ చేసి వ్యవసాయ రెవెన్యూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి రైతుకు మూడు బస్తాలు ప్రతి దఫాలో ఇవ్వాలని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధి కారులు లక్ష్మయ్య, అశ్రఫ్ హిమ బిందు అన్ని రైతు సేవా కేంద్ర సిబ్బంది సుహాసిని ,ఆయేషా ,సింధు,మధు,అశోక్,చక్రధర్ ,నాగార్జున, ప్రియాంక,పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఎంపిడిఓ జీఎన్‌ఎస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుసులూరు గ్రామంలో ప్రస్తుత సీజన్‌లో అధికంగా జ్వరాలు రాకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఫీవర్ సర్వే, స్పెషల్ శానిటేషన్, కాలువలు క్లీనింగ్ చేయించడం, చెత్త దిబ్బలు తొలగించడం లార్వా లేకుండా స్ప్రేయింగ్ చేయించడం వంటి మొదలగు కార్యక్రమాలు సర్పంచ్ ఆద్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులు చెత్తను ఎక్కడబడితే అక్కడ పడేయరాదని చెత్త బండి వచ్చినప్పుడు చెత్తను వేయాలని సూచించారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ ఆముదాల నీలవేణి, మలేరియా అధికారులు పాల్గొన్నారు.

## ఆధార్ ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఆధార్ ఆపరేటర్లకు యూనివర్సల్ ఆధార్ క్లయింట్‌పై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించిన ఈ శిక్షణనుద్దేశించి జడ్‌పి సిఈఓ జి నాసరరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా ఆధార్ ఆపరేటర్లు తమ సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు, ఆధార్ సేవలను సకాలంలో పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంచేటట్లు కృషి చేయాలని కోరారు. యూనిక్ క్లయింట్ సాఫ్ట్‌వేర్‌ను సమర్థవంగా అమలు చేయాల్సిన అవసరం ఆపరేటర్లపై ఉందని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ ఎస్ వెంకట రమణ శిక్షణ ఇచ్చారు.




శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న జడ్‌పి సిఈఓ నాసరరెడ్డి

## రాష్ట్ర స్థాయి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు ముందుండాలి



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పథకాల వేటలో జిల్లా క్రీడాకారులు ముందుండి గెలుపొందాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగేశ్వరి, క్రిష్ణలు అన్నారు. మంగళవారం కర్నూలు ఔట్‌డోర్ స్టేడియం నందు జిల్లా స్థాయి కరాటే, వెయిట్ లిఫ్టింగ్, బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకుని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం జిల్లా కోశాధికారి శ్రీనివాస్, వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు యూసుఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు పరమేష్, సుంకారావు, కిరణ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు మాంటిస్సోరీ విద్యార్థిని ఎంపిక



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** అక్టోబరు 8నుంచి విశాఖ పట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు కర్నూలు నగరంలోని ఏ క్యాంపులో ఉన్న మాంటిస్సోరి పాఠశాల విద్యార్థిని పూజిత ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ కెఎన్‌వి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్బంగా మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పూజితను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఏకాగ్రతను పెంపొందించుకుని పూజిత రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఉయ్యాలవాడలో సామక్కగారి సుశీలమ్మ(65) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు ఉయ్యాలవాడ ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఆమె ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఇరుగు, పొరుగు వారు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి గది తలుపులు పగులగొట్టి చూడగా ఆమె మంచంపై మృతి చెంది కనిపించింది. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉందని అన్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకట సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## దెబ్బతిన్న ఉల్లి పంట పై ఎన్యుమరేషన్ చేయండి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఎర్లీ ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఉల్లి పంటపై ఖచ్చితమైన ఎన్యుమరేషన్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, వ్యవసాయ అధికారులతో కలెక్టర్ విజయవాడ నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యుమరేషన్‌లో పొరపాట్లు జరగకూడదని, మీరు పంపిన డేటాను వర్షపాత నివేదికలతో సరిపోల్చి ప్రభుత్వానికి తెలపాలని స్పష్టం చేశారు. ఉల్లి పంటను పక్వానికి రాకముందే కోయకూడదని కనీసం 110రోజుల తర్వాత కోసి గ్రేడింగ్ చేసుకుని మార్కెట్‌కు తీసుకురావాలని ఈ విధంగా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులను, గ్రామ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. క్యూరింగ్ చేయకుండ రైతులు ఉల్లిని మార్కెట్‌కు తీసుకొస్తున్నారని దీనివలన వారికి తగిన ధర రావడం లేదని ఆమె పేర్కొన్నారు. టమోటా పంటపై నల్లమచ్చల ప్రభావం వల్ల రైతులకు నష్టాలు వస్తున్నాయని దీనిపై సంరక్షణ చర్యలు చేపట్టి టమోటాకు మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఉల్లి పంట క్రాప్ బుకింగ్‌ను శనివారం లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. నవ్య, డిఆర్ఓ సి వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సిఈఓ నాసరరెడ్డి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిరోజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన దూదేకుల కార్పోరేషన్ డైరెక్టర్ దస్తగిరి




ఫిరోజ్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్ దస్తగిరి

**నంద్యాల నూనెపల్లె, మేజర్ న్యూస్ :** రాష్ట్ర నూర్‌భాష దూదేకుల కార్పోరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఫిరోజ్‌ను దూదేకుల కార్పోరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి కలిసి శాలువాతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్ జైనాబీ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య
బుధవారం | 17 సెప్టెంబరు 2025

# అపరిశుభ్రంగా..

# ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం

- హాస్పటల్లో అరకొర వసతులు..
- టాయిలెట్ల క్లినిక్ లిక్విడ్ నిల్...
- హెచ్డిఎఫ్ నిధులు మంజూరైన కొనుగోలు చెయ్యని స్టేషనరీ....
- డాక్టర్స్ కు కుర్చీలే లేవు..
- ఓపి స్లిప్పులు,రిజిష్టర్లు లేవు.....




**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ప్రజా సంక్షేమం, ఆరోగ్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గ్రామీణ పట్టణ మండల ప్రాంతాలలో ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాలు రూప కల్పన చేసి ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడు తున్న మండల కేంద్రమైన చాగలమరిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి అన్ని వసతులు ఉన్న అపరిశుభ్రంగా కనిపిస్తున్న పట్టించుకున్న పాపాన ఉన్నతాధికారు, అధికారులు ఉన్నారు...**

జిల్లా కేంద్రమునకు చాగలమర్రి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం చివరిగా ఉండడము ఈ ప్రాంతం నల్లమల అటవీ ప్రాంతం కావడం గ్రామీణ ప్రాంతాలు ఎక్కువ ఉండటం వల్ల ప్రజలు నిత్యము అనారోగ్య బారిన పడి ఆరోగ్య కేంద్రం కోస్తూ ఉండడంవల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే బావుంటుందని ఆస్పత్రిలో కూడా అన్ని వసతులు ఉన్నప్పటికీ సౌకర్యాలు మాత్రం అరకొరకనే కనిపిస్తున్నాయి. గత వారం వరకు ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత కూడా సమస్యగా ఉండేది. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం కు హాస్పిటల్ అభివృద్ధి నిధులు మంజూరైనప్పటికిని కొనుగోలు చేయకపోవడం కొసమెరుపు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో టాయిలెట్ క్లినిక్ కూడా లిక్విడ్ లేక ఇ బ్బందులు ఎదురవుతున్నాయి, కనీసం డాక్టర్ కూ ర్చొని కుర్చీ కూడా ఆయుష్మాన్ కేంద్రం ది కాదని ఎం ఎల్ హెచ్ పి స్టేషనరీని ఆసుపత్రిలో వాడుకోవ డం జరుగుతుంది. బీపీ మిషన్ లో వాడే బ్యాటరీలు కూడా అయిపోయిన పట్టించుకోవడంలేదని రోగుల కు బీపీ చూడాలంటే కష్టంగా మారింది. ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు ఉన్నప్పటికీ డిడిఓ నంద్యాల నుంచి రావడం వల్ల ఈ ఇబ్బందులు ఎదురు కావడం కోసమెరుపు. ఇప్పటికైనా హెచ్డీఎఫ్ నిధుల నుంచి అన్ని సౌకర్యాలతో కూడిన వసతులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయంపై డాక్టర్ అంజలి వివరణ కోరగా : ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో అపరిశుభ్రంగా ఉండడం వాస్తవమేనని పిచ్చి మొక్కల వల్ల దోమలు ఇతర కీటకాలు పెరిగిపోతున్నాయని, అలాగే ఆరోగ్య కేంద్రంలో స్టేషనరీ లేక ఇబ్బందులు పడటం జరుగుతుందని వివరణ ఇచ్చారు.

**చాగలమర్రి మేజర్ న్యూస్ :**



## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- **యూరియా తగ్గిస్తే రైతుకు ప్రోత్సాహాలు 800 అందిస్తాం**
- **సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్త యూరియా పై ప్రతిపక్ష సభ్యులు రభసా**

**మిడుతూరు మేజర్ న్యూస్:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సర్వ సభ్య సమావేశానికి నంది కొట్కూరు శాసనసభ్యులు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి హాజరయ్యారు.గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గ్రామాలలో ప్రజలు ఎందుర్కొంటున్న విద్యుత్, ఉపాధి, మొక్కల సంరక్షణ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ఎంపీడీవో దశరథ రామయ్య అధికార విపక్షాల సభ్యులకు చదివి వినిపించారు. వ్యవసాయ అధికారి పీరు నాయక్ వ్యవసాయ నివేదికలు చదివి వినిపించారు విపక్షాల సభ్యుడు ఎంపీటీసీ హరి సర్వోత్తమ్ రెడ్డి యూరియా ఆర్ ఎస్ సర్ కేంద్రాలకు యూరియా ఎప్పుడు వస్తుందని అడగగా మండలానికి 629మెట్రిక్ టన్నులు మండలానికి మంజూపైందని,ఇంకా రావాల్సింది 240 మెట్రిక్ టన్నులు అని ఏఓ తెలిపారు.ప్రతిపక్ష సభ్యులు అందిన వారికి మాత్రమే యూరియి అందుతుందని మాకు అందడం లేదని ఎంపీపీ వెంకటేశ్వరమ్మ అన్నారు. దీనిపై ఎమ్మెల్యే మీ ఇంటి దగ్గరికి తెచ్చి ఇవ్వాలా? అని అన్నారు. కొద్దిసేపు సభ రసభ సగా మారింది వివరణ ఇచ్చిన ఎమ్మెల్యే యూరియా అందిస్తున్నామని యూరియా వాడకం తగ్గిస్తే ప్రభుత్వం రాయితీ 800 రూపాయలు రైతు అకౌంట్లోకి జమ చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు వర్షాభావ పరిస్థితి వల్ల మండలంలో మొక్కజొన్న ప్రతి పంట ఎక్కువగా వేశారని అయినప్పటికీ యూరియఅందరికీ సమానంగానే అందిస్తున్నామని తెలిపారు.వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏ ఒక్క అధికారీ సమావేశం దృష్టికి తీసుకు రాలేదు. మండలంలో, మండల కేంద్రంలో చిన్నారులు, మధ్య వయస్కులు జ్వరంతో బాధపడు తున్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎవరూ స్పందించకపోవడం విచారకరం. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, వాటిని పరిష్కరించేలా సమావేశాలు ఉండాలి. నామమాత్రంగా నిర్వహించడం ఎందుకని ప్రజాప్రతినిధులు మండిపడు తున్నారు. జలకనూర్ రైతులుచెరువు సమస్యను పరిష్కరించాలని, ఎమ్మెల్యేను కోరారు దీనిపై ప్రభుత్వానికి నివేదికలు పంపించామని పూర్తి చేస్తామని అన్నారు ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వైస్ ఎంపీపీ నబి రసూల్ మండిపడ్డారు. రోడ్లు అద్వానంగా తయారయ్యాయని సొంత కథను పూర్తి చేయాలని కోరారు కదా ప్రభుత్వంలో గత ప్రభుత్వంలో రోడ్లను నిరుద్యోగులను నిర్వీర్యం చేసిన ఘనత వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే వారిపై విరుచుకుపడ్డారు మెగా డీఎస్సీ 2678 పోస్టు లకుగాను 2590 పోస్టులను త్వరలోనే ఆర్డర్ కాపీలను అందిస్తున్నారు అని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లడంతో రోడ్లు వేయలేకపోయామని అందరూ గ్రహించి ప్రతిపక్షాల విపక్షాల సభ్యులకు గ్రామాల అభివృద్ధి చేసుకోండి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే అన్నారుకొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సహకార సొసైటీ చైర్మన్ ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి సర్పంచులు ఉషారాణి ఇందిరమ్మ జయ లక్ష్మమ్మ హరిత నాగ స్వామి రెడ్డి కోసం సభ్యుడు మౌలా టిడిపి నాయకులుసబ్ భాష నరసింహ గౌడ్ వీరారెడ్డి ఇద్రుస్ హౌసింగ్ ఐటీడీపీ తలకాయ ఇంచార్జ్ ఇంతియాజ్ఈ ఈ కృష్ణారెడ్డి. మైనర్ ఇరిగేషన్ శాఖ, ఐసిడిఎస్, ఆర్ అండ్ బి, ట్రాన్స్కో ఏఈలు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రతి ఉద్యోగికి పదోన్నతి, బదిలీలు సాధారణం




**ఓర్వకల్లు, మేజర్న్యూస్ :** ప్రతి ఉద్యోగికి పదోన్నతులు, బదిలీలు సర్వసాధారణమని డ్వామా పిడి, ఓర్వకల్లు మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణయ్య అన్నారు. ఓర్వకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు నంద్యాల జిల్లా డ్వామా అకౌంటెంట్ మేనేజర్గా పదోన్నతి పొందడం సంతోషంగా ఉందని ఎంపిపి తిప్పన, జడ్పిటిసి రంగనాథ్ గౌడ్, వైస్ ఎంపిపి పద్మనాభ రెడ్డి, మండల ప్రజా పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వెంకటరమ ణయ్య, టిడిపి నాయకులు గోవిం దరెడ్డి, పాలకొల్లు సుధాకర్ రెడ్డి, గుట్టపాడు సర్పంచ్ మోహన్రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ శ్రీనివాసులుకు శాలువా కప్పి, పూల మాలతో సన్మానించారు. కార్యక్రమం లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను శిక్షించాలి


అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న కురువ సంఘం నాయకులు

**కర్నూలు టౌన్, మేజర్న్యూస్ :** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం మణేకుర్తి గ్రామంలో ఈ నెల 10న కురువల ఆరాధ్య దైవమైన శ్రీ భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకె రంగస్వామి, ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, కోశాధికారి కెసి నాగన్నలు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కురువ సంఘం ఆద్వర్యంలో నగరంలోని జిల్లా అడిషనల్ ఎస్పీని కలిసి వినతిపత్రం అందచేశారు. అల్లూరు వెంకటేశ్వర్లు, రేమట సర్పంచ్ వెంకన్న, కె మహేష్, కె ప్రసాద్, కె శివ, కె సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డు గ్రహీతకు అభినందన


అవార్డు గ్రహీత సునీతను అభినందిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్న్యూస్ :** నగరంలోని స్థానిక ఎస్టిబిసి కళాశాలలో పోలిటికల్ సైన్స్ అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న డా. వేదాలు సునీతకు రాష్ట్ర ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఉత్తమ అధ్యాపకురాలుగా ఈ నెల 14న గుంటూరులోని కెనడి ఇంటర్నేషనల్ స్కూల్ నందు అవార్డును అందుకున్నారు. వేదాల సునీత కర్నూలు నగరంలోని యస్టిబిసి కళాశాలలోని నిరుపేద విద్యార్థులకు చేసిన సేవకు గుర్తింపుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల కరస్పాండెంట్ డా.ఆర్ఆర్డి సజీవరాజు, కళాశాల ప్రిన్సిపల్ డా. సునీత రోస్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ధన్యవతి, మారగారెట్, విజయకేసరి, మౌనిక, అధ్యాపకేతర సిబ్బంది మాధవరావు, సురేష్, శ్యామ్సన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిద్దెతోట పెంపకదారులకు బహుమతులు

**– కమీషనర్ పి విశ్వనాథ్**



**కర్నూలు (కెఎంసి), మేజర్న్యూస్ :** కర్నూలు నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా హరిత ఆంధ్ర అంశంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి మేడపై అపార్టుమెంట్ల బాల్కానీలలో మొక్కలు, పండ్ల చెట్లు, కూరగాయలు పెంచడాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమంగా తోటలు పెంచుతున్న ఔత్సాహికులకు నగరపాలక సంస్థ నుండి బహుమతులు అందచేయబడతాయని తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను సచివాలయం పరిధిలోని శానిటేషన్ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసిన తోటలను శానిటేషన్ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పరిశీలించి ఉత్తమమైన వారిని ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఈ నెల 20న ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి కార్యాలయం, పాఠశాల, హాస్టల్స్ ఒక తోటగా మారితే కర్నూలు నిజమైన స్వచ్ఛ హరిత నగరంగా అవతరిస్తుందన్నారు.

# బాబూ.. పది మెడికల్ కాలేజీలను కూడా నడపడం చేతకాదా ?

- రాష్ట్రంలో బాధ్యతలేని ముఖ్యమంత్రిగా చంద్రబాబు కొనసాగడం మన దౌర్భాగ్యం
- ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా తీసేసి భీమా పరిధిలోకి తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నారు
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం.. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిలు
- ఆదోని మెడికల్ కాలేజీ వద్ద వైసీపీ పార్టీ భారీ ప్రదర్శన పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎర్రకోట జగన్మోహన్ రెడ్డిలు



ఆదోని మెడికల్ కాలేజీని సందర్శించిన వైసీపీ నాయకులు

**ఆదోని టౌన్/ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్ :** "రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందాలన్న గొప్ప సంకల్పంతో అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతి పార్లమెంటుకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారు. అయితే 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా అనుభవం, 40 ఏళ్లపాటు సుధీర్ఘ రాజకీయ అనుభవం ఉందని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకి కనీసం పది మెడికల్ కాలేజీలను కూడా నడపడం చేతకాదా?" అంటూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ లు ఘాటుగా విమర్శించారు. మెడికల్ కాలేజీల పీపీపీ పద్ధతి విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో ఆదోని మెడికల్ కాలేజీ వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మిగనూరు నుంచి వైసీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ యువజన ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ లు పెద్ద ఎత్తున ఆ పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. కాలేజీలో నిర్మాణంలో ఉన్న పలు బిల్డిం గులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం తన బినామీలకు కట్టబెట్టడం కోసమే ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)పేరుతో మెడికల్ కాలేజీలను సీఎం చంద్రబాబు ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నా రని మండిపడ్డారు. పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల ప్రజలకు ఏదైనా అనారోగ్యం జరిగి ఆసుపత్రికి వెళ్లాల్సివస్తే.. వంద కిలోమీటర్లకుపైగా దూరం లో ఉన్న కర్నూలుకి వెళ్లాల్సిన దుస్థితి ఉందన్నారు. అదే ఆదోనిలో మెడికల్ కాలేజీ నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొన సాగితే.. వందలాది మెడికల్ సీట్లతో పాటు వైద్య విద్యార్థులు చదు వుకోవడానికి మంచి అవకాశం ఉంటుందన్నారు. అంతేకా కుండా ప్రజలకు ఉచిత ఓపి, ఉచిత ఆపరేషన్లు అందుబాటులోకి వస్తాయ ని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా తీసేసి దాన్ని భీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోం దని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బాధ్యతలేని ముఖ్య మంత్రిగా చంద్రబాబు కొనసాగడం మనం చేసుకున్న దౌర్భా గ్యమ న్నారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణను ప్రజల తంపున వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చ రించారు. వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ, జిల్లా వైసీపీ యువజన విభాగ అధ్యక్షుడు ఎద్దుల శివారెడ్డి ఆదోని వైసీపీ నాయ కులు చంద్రకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహులు, శేషిరెడ్డి, సం దీప్ రెడ్డి, సన్నీ, దేవా, తాయన్న, ఫయాజ్, ఎమ్మిగనూరు వైసీపీ నా య కులు బుట్టా రంగయ్య, రియాజ్ అహ్మద్, కామార్తి నాగేశప్ప, నజీర్ అహ్మద్, జిల్లా చేనేత అధ్యక్షుడు శివప్రసాద్, నందవరం విరుపాక్షిరెడ్డి, మధుబాబు, మల్లికార్జున తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొబ్బరికాయ ధరలు
# ప్రియం.. ప్రియం





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** సాధారణంగా కొబ్బరికాయ తీసుకొని గుడికి వెళ్లి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకుని రావడం ఆనవాయితీ. అయితే ఇప్పుడు కొబ్బరికాయ ధర కొండెక్కి కూర్చోవడంతో కొబ్బరికాయ కొనడానికి భక్తులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి ఉంది. ప్రస్తుతం కొబ్బరికాయ ధర 35 రూపాయల నుంచి 40 రూపాయల వరకు పలుకుతోంది. గతంలో ఇరవై రూపాయలు ఉన్న కొబ్బరికాయల ధర వరదల కారణంగా టెంకాయల కొరత అంటూ 30 రూపాయలకు చేరింది. కొబ్బరి కాపు(పంట) రాగానే టెంకాయ ధర తగ్గుతుందంటూ వ్యాపారులు చెప్పినా ధర తగ్గకపోగా మరింత పెరిగింది. శ్రావణమాసంతో టెంకాయ ధర 35 నుంచి 40 రూపాయలకు చేరింది. ప్రస్తుతం దసరా నవరాత్రి ఉత్సవాలు, తర్వాత కార్తీకమాసం ఉండడంతో టెంకాయ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని భక్తులు ఆందోళన చెందుతున్నారు. టెంకాయ ధర భారీగా పెరగడంతో మార్కెట్లో ఎండుకొబ్బరికి బాగా గిరాకి పెరిగింది. ప్రస్తుతం సాధారణ మార్కెట్లో ఎండు కొబ్బరి ధర కిలో 350 నుంచి 400 రూపాయల వరకు పలుకుతుంది. దీంతో ఎండు కొబ్బరి ఉపయోగించువారు ఆందోళన చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొబ్బరి నూనె కూడా ధర భారీగా పెరిగింది. టెంకాయ ధర పెరగడంతో ఎండుకొబ్బరి, కొబ్బరి నూనె అలాగే కొబ్బరితో తయారు చేసే తినుబండారాల ధరలు కూడా పెరిగాయి. ఏది ఏమైనా కొబ్బరికాయ ధర తగ్గితే తప్ప కొబ్బరి అనుబంధం ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశం ఉందని ప్రజలు తెలుపుతున్నారు. ప్రస్తుతం కొబ్బరికాయ పేద భక్తులకు అందుబాటులో లేదన్నది వాస్తవం. దీంతో భక్తులు గుడికి వెళ్లాలంటే కొబ్బరికాయ లేకుండా గుడికి ఎలా వెళ్లాలి అంటూ ఆలోచిస్తుండగా కొబ్బరికాయను కొనలేమంటూ మరికొందరు పేర్కొంటున్నారు.

## ఆవోపా కార్యాలయంలో
# ఇంజనీర్లకు సన్మానం




**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఇంజనీర్స్ డే సందర్భంగా నంద్యాల ఆవోపా కార్యాలయంలో సముద్రాల మధుసుధన్ రావు అధ్యక్షతన పలు శాఖల్లో విశేష సేవలు అందించిన 10 మంది ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. సముద్రాల మధుసుధన్ రావు మాట్లాడుతూ దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. డ్యామ్‌ల నిర్మాణం, రోడ్లు, భవనాల రూపకల్పన, తదితర వాటిలో ఇంజనీర్ల పాత్ర విశేషమైందని అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను అప్పటి బ్రిటీష్ వారు గుర్తించి ఘనంగా సత్కరించారని గుర్తు చేశారు. ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లను సన్మానించడం సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఆత్మకూరు సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షులు మూర్తి, జనార్ధన్ శెట్టి, చెంచయ్య, మేడా రామకృష్ణ, వెంకటేశ్వర్ రావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ మద్ధత్తు ధర రూ.2400లకు కొనుగోలు చేయాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్




మాట్లాడుతున్న ఏఐకేఎస్ నాయకులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి పంటకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 కల్పించి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల సీపీఎం కార్యాలయంలో రైతు సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొని కూటమి ప్రభుత్వంలో పండిన పంటలకు మద్దతు ధరలు లేక మధ్య దళారుల దోపిడీ వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లలో పండించిన వరి, మొక్కజొన్న, మినుము, మిరప, పొగాకు పంటలకు గిట్టుబాటు ధరలు లేక ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అమలు జరగక జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలో 5,88,478 ఎకరాల విస్తీర్ణం సాగు కావాల్సి ఉండగా 5,10,200 ఎకరాలు సాగైందని, ఇందులో 1,54,000 ఎకరాలలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారన్నారు. అత్యధికంగా ఆత్మకూరు, నందికోట్కూరు, బనగానపల్లె, ఆళ్ళగడ్డ నియోజకవర్గాలలో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. రైతులు ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారని, ప్రస్తుతం పంట కోతలు ప్రారంభమయ్యాయన్నారు. మంచి దిగుబడి వచ్చినా మద్దతు ధరలు లేకపోవడంతో మధ్య దళారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,400 కాగా మధ్య దళారీలు క్వింటాకు రూ.2000 నుంచి రూ.2050 మాత్రమే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. దీంతో రైతులు రూ.12 వేల వరకు నష్టపోతున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం సకాలంలో స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతులకు మద్దతు ధర అమలు చేసి ఆదుకోవాలని, అలాగే రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 11,12 వ తేదీల్లో ఆత్మకూరులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు గౌస్‌కృష్ణ, మహేంద్ర, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విశ్వనాయకుడు పీఎం మోదీకి
# సేవలతో జన్మదిన వేడుకలు

- 17 నుంచి అక్టోబర్ 2వరకు రాష్ట్ర చరిత్రలో సేవా కార్యక్రమాలు
- జీఎస్టీ ఫలాలతో ప్రజలు ఆనందిస్తారు – జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు




**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు దేశవ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వనాయకులు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు దేశ వ్యాప్తంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ గాంధీ జయంతి వరకు సేవా పహాడ్ అనే పేరుతో సవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం నరేంద్ర మోదీకి పాలాభిషేకంతో ప్రారంభించి మెగా రక్తదాన శిబిరాన్ని బాలాజీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు తెలిపపారు. నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి అన్నదానం చేస్తామన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో, 37 మండలాలు, మేజర్ పంచాయతీల్లో సేవా పహాడ్ కార్యక్రమాలు నిర్వహించడానికి సమావేశం ఏర్పాటు చేసుకుని జిల్లాకు ముగ్గురు కన్వీనర్లు ఏర్పాటు చేసి బూత్‌స్థాయి కమిటీల వరకు సేవలు విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేసుకున్నామన్నారు. నేతల పుట్టిన రోజుకు వస్తే వారిని కీర్తించడం ఆనవాయితీగా వస్తుందని అందుకు భిన్నంగా ఆయన పుట్టిన రోజు గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఢిల్లీకి ఆహ్వానిస్త వారి కాళ్లు కడిగిన సందర్భాన్ని సందేశంగా తీసుకుంటున్నామన్నారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ళ హయాంలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాన్ని అభివృద్ధి చెందే దేశంగా చేస్తున్నారన్నారు. దేశ ప్రజలకు జీఎస్టీ తగ్గించడం వల్ల 355 నిత్యావసర సరుకులు తగ్గుముఖం పట్టడంతో నెలరోజుల ముందే దీపావళి వేడుకలు దేశ ప్రజలు చేసుకుంటున్నారన్నారు. దాయాది దేశం పాకిస్తాన్ ఎప్పుడు భారత్‌కు కీడు తలపెడుతున్నా పాకిస్తాన్ పార్లమెంట్ సమావేశంలో మోదీ జిందాబాద్ అనే నినాదాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నంద్యాల రాష్ట్ర చరిత్రలో మిగిలిపోయే విధంగా సేవ కార్యక్రమాలు చేసి మొద టి స్థానం సాధించేందుకు అందరి కృషితో సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేటి నుంచి మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17నుంచి అక్టోబరు 2వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కోడుమూరు వైద్యాధికారి నాగరాజు తెలిపారు. స్వస్థ్ నారి స శక్తి అభియాన్ అనే పథకం కింద మహిళల ఆరోగ్యం బలమైన కుటుంబం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతోందన్నారు. మహిళలకు అసంక్రమిత వ్యాధుల వల్ల జరుగుతున్న నష్ట నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని వైద్యాధికారి బి నాగరాజు తెలిపారు.

# సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



మధు కుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్ ,మేజర్ న్యూస్:** డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ కుటుంబానికి సీఎం సహాయనిధి ఆర్థిక సహాయం అందించారు. గతసంవత్సరం థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో కిడ్నాప్‌కు గురైన మధు కుమార్‌ను సురక్షితంగా విడిపించేందుకు ఎమ్మెల్యేవ్యక్తిగతంగా ముందడుగు వేసి,ఆ సమయంలో ఖర్చైన మొత్తం తిరిగి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకుంటూ, సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ?10 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే మధు కుమార్ కుటుంబ సభ్యుల చేతికి అందజేశారు. ఈ సందర్భంగా మధు కుమార్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకున్నందుకు డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డిమరియు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సాయం తమ కుటుంబానికి ఎంతో ఉపశమనం కలిగించిందని, ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తున్న నాయకులకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

## పశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి**



**ప్యాపిలి మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఇందుకోసం అవసరమైన టీకాలనుఅందుబాటులోకి తెచ్చిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ఆర్థిక పరిస్థితి బలోపేతానికి పశుసంవర్ధక రంగం ప్రధాన భూమిక వహిస్తుందన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడి విక్టర్, తాసిల్దార్ భారతి,టిడిపినాయకులుఖాజాపిర,తొప్పెలశ్రీనివాసులు,చంద్రపల్లిలక్ష్మీనారాయణ యాదవ్, కొంగనపల్లి మధు,పెద్ద పూజర్ల ప్రసాద్ రెడ్డి, చల్లా వీరాంజనేయులు, గొల్ల రామ్మోహన్ యాదవ్,గుడిపాడు వెంకటరెడ్డి, ప్రిన్సిపల్ మధు కుమార్, జక్కసాని కుంట్ల ఆదిరెడ్డి, బోన్ చెరువుపల్లి కృష్ణయ్య, వార్డు మెంబర్ వెంకటేష్, కడితం ప్రతాప్ రెడ్డి, ఎస్కేవలి, కలకట్ల ప్రసాద్,చిన్న పూజర్ల పుల్లాసి దస్తగిరి, రమేష్ గౌడ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## కంబదహాల్ రోడ్డును పరిశీలించిన ఆర్‌అండ్బి అధికారులు



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో పూర్తిగా ధ్వాంసమైన రోడ్లను ఆర్‌అండ్బి అధికారులు పరిశీలించారు. మంగళవారం ఆర్‌అండ్బి అధికారులు డిఈ రమణ ఏఈ ఫిబితో కలసి మండలంలోని కంబదహాల్, మూడుమల రోడ్లను పరిశీలించారు. అనంతరం డిఈ మాట్లాడుతూ మండలంలో పూర్తిగా పాడైపోయినరోడ్లను తొందరలోనే బాగుచేస్తామని అందుకు కావాల్సిన కాంట్రాక్టు,ఎస్టిమేషన్‌తదితర పనులకు సంబందించిన చర్యలు పూర్తి చేశామని వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణాలు చెప్పడతామని డిఈ. రమణ తెలిపారు.

# జిల్లా జైలు, మహిళా జైలు తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి కబర్థి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు మంగళవారం నగరంలోని పురుషుల జిల్లా కారాగారము, మహిళల కారాగారమును తనిఖీ చేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించామన్నారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని వారు ఖైదీలకు న్యాయ సలహాలు అందిస్తారని తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షణ పూర్తి చేయాలని, ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70ఏళ్లు వయసు పైబడిన ఖైదీలకు అనారోగ్యంతో బాధపడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే న్యాయసేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం, సులోచన, ఖైదీలు పాల్గొన్నారు.

**అబ్జర్వేషన్ హోం ఫర్ బాయ్స్‌ను తనిఖీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి కబర్థి, కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు మంగళవారం నగరంలోని అబ్జర్వేషన్ హోం ఫర్ బాయ్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించి అక్కడున్న పిల్లలకు ఎవరికైనా న్యాయవాది లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమించి వారి కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ హుస్సేన్ బాష, డిస్టిక్ ప్రొబేషనరీ ఆఫీసర్ దివాకర్, సిడబ్ల్యూసి చైర్మన్ జుబేదాబేగం, జువే నైల్ జస్టిస్ బోర్డు మెంబర్స్ సునీత మాదవి, ఆయా సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభివృద్ధి సాధ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** కూటమి ప్రభుత్వంతోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని బి.సి ఇందిరమ్మ అన్నారు. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచి కొత్త వాటిని నెలకొల్పేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె గ్రామ సచివాలయం నాలుగులో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సతీమణి బి.సి ఇందిరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర




బి.సి ఇందిరమ్మను సత్కరిస్తున్న దృశ్యం

జాతీయస్థాయిలో మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని మహిళలు భర్తలు తల్లిదండ్రులపైన ఆధారపడకుండా వారి కాళ్లపై నిలబడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా సంఘాలను ప్రారంభించాలని పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలను కట్టెల పోయ్యి నుండి గ్యాస్ సిలిండర్‌వైపు నడిపించిన ఘనత చంద్రబాబుదేనని మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని అందులో భాగంగా సూపర్‌సిక్స్‌లో మహిళలకు పెద్దపీట వేయడం జరిగిందని ఉచిత బస్సు పథకం, కుట్టుమిషన్ల పంపిణీ వంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఇంచార్జి సునీల, ఫకూర్‌బి, బి.ఐ.సి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం.. ముఖ్యమంత్రి సహాయనిధి- ఎమ్మెల్యే బుడ్డా

**– రూ. 40లక్షల సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమతలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరంలాంటిదని శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్న 70 మంది లబ్దిదారులకు రూ.40 లక్షల చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ కూటిమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేద ప్రజల సంక్షేమాభివృద్ధికి పెద్దపీర వేస్తు ఆపదలో ఉన్న వారికి అండగా నిలిస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కనీసం ఆసుపత్రిలో చూపించుకునేందుకు కూడా ఆర్థిక స్థోమత లేని పేద, మధ్యతరగతి ప్రజలక అండగా నిలిచి ఆర్థిక భరోసా నిచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రాన్ని సంక్షేమాభివృద్ధిపై పరుగులు పెట్టిస్తు ఎన్టీఆర్ వైద్యసేవలో లేని జబ్బులకు వైద్యం చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందన్నారు. అధికారంలోకి వచ్చి 15



బాధితులకు సిఎంఆర్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

నెలల్లోనే నియోజకవర్గంలో సుమారు 4కోట్లకుపైగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ చెక్కులపై నియోజకవర్గంలో కొందరు వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అలాంటి వారికి కూడా ముఖ్యమంత్రి సహాయ నిధిని అందించామనిఅన్నారు. నియోజకవర్గంలోని ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని, మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధితో పాటు సొంత నిధులతో రోగులకు అండగా నిలుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐరన్బండ గ్రామంలో ఇరువర్గాల ఇండ్లలో పోలీసుల సోదాలు

**- ఆరోపణలు ఎదుర్కొంటున్న 30 మంది గృహాలలో సోదాలు**

**- గ్రామంలో అనుమతి పత్రాలు లేని 10 ద్విచక్రవాహనాలు స్వాదీనం**

**- 100 ఫోన్తో ఉలిక్కి పడ్డ పోలీసులు**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఐరన్బండ గ్రామంలో గత వారం రోజుల క్రితం ఇరువర్గాల మధ్య దాడులు ప్రతి దాడులు జరిగాయి. దీంతో గ్రామానికి చెందిన గుర్తు చెప్పని వ్యక్తి 100 కు పోన్ చేసి ఐరన్బండ గ్రామంలో హత్యలు చేసుకునేందుకు ఇరువర్గాల వారు మారణాయుదాలతో సిద్ధంగాఉన్నారుఅని చెప్పడంతో గోనెగండ్ల పోలీసులు అల్టర్ అయ్యారు. మంగళవారం ఉదయం గోనెగండ్ల సీఐ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 5మంది ఎస్ఐలు, ఒక పీఎస్ఐ,51మందిపోలీస్‌కానిస్టేబుల్స్ ఐరన్బండగ్రామానికి వెళ్లారు. ఇరువర్గాలలోని అన మానిత వ్యక్తుల ఇండ్లలో పోలీసులు సోదాలు చేశారు. మారణాయుదాలు ఉన్నాయ లేదా అని వారి ఇండ్లలో పోలీసులు జల్లడపట్టారు. అయితే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తుల దగ్గర ఎలాంటి అనుమతి పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని 10 ద్విచక్రవాహనలను గుర్తించి వాటిని స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గ్రామప్రజలతో సమావేశం నిర్వహించారు.



ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు గొడవలకు దూరంగ ఉండాలని ఒకరిని నమ్మి మరొకరు గొడవలకు పోరాదని కోరారు. గ్రామంలో ఎలాంటిగొడవలకు పోకుండా ఉంటారో వారికి పోలీసులు ఎల్లవేల సహకారం అందిస్తామన్నారు. చదువుకునే పిల్లలు ఉన్నకుటుంబాల వారు గొడవలకు దూరంగ ఉండాలని కోరారు. అలాగే పలు సూచనలు చేశారు. గ్రామం బాగుండాలని కోరుకుంటు పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరి దగ్గర అయిన మారణాయుదాలు ఉన్నట్లు అయితే పోలీసులకు అప్పగించాలని కోరారు. ఇరువర్గాల వారికి పోలీసులు 'హెచ్చరికలు జారీ చేశారు.

# టిడిపి ప్రభుత్వం పై బురద జల్లడం మానుకోవాలి

**సొసైటీ అధ్యక్షులు బొమ్మన రమాకాంత్ రెడ్డి**

**వెల్దుర్తి మేజర్ న్యూస్:** ఉల్లిరైతులందరికి క్వింటాలుకు రూ.1200 మద్దతు ధర ప్రకటించిన తెదేపా ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవిని ఉద్దేశించి తెదేపా మండల కన్వీనర్ టీ.బలరాంగౌడ్, వెల్దుర్తి సొసైటీ అధ్యక్షులు బొమ్మన రమాకాంత రెడ్డి,తెదేపా నాయకులు రామళ్లకోటరామ క్రిష్ణఆచారి, పుల్లగుమ్మి వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రనాయుడులు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని బొమ్మన శివశంకర్ రెడ్డిస్వగృహంలో మంగళవారం వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు ఆదేశాల మేరకు ఈ సమావేశంఏర్పాటుచేశామన్నారు. మండలంలోని కొసనాపల్లి గ్రామంలో రైతుకురువ రామచంద్రుడు కుటుంబకలహాల కారణంగా ఆత్మహత్య చేసుకుంటే మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభత్వం ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని ప్రకటనచేశారన్నారు,ఇది వాస్తవం కాదన్నారు. మీ నాయకుడు జగన్మోహన్రెడ్డి శవాలపై రాజకీయాలు చేశారనిమీరు అదేవిధంగా చేయడం తగదన్నారు. నిజనిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అభివృద్ధి పనులు చేస్తుంటే ప్రతిపక్షం వాళ్ల విమర్శలు తగదన్నారు. మహిళలకు ఉచిత బస్సు అమలు చేశామన్నారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర కింద అక్టోబర్ నెలలో 15 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న వెల్దుర్తి సొసైటీ అధ్యక్షు లు బొమ్మన రమాకాంత రెడ్డి,తెదేపా నాయకులు

# బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ సందర్శన



**పాములపాడు మేజర్ న్యూస్ :** రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని బొజ్జ దశరధరామిరెడ్డి సభ్యులు నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉన్న 30 రోజుల్లో 4 టిఎంసీల కృష్ణా జలాలను తరలించే విధంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచినప్పటికీ, రాయలసీమ ప్రాజెక్టులైనఎస్సార్‌బీసీ, తెలుగుగంగ, గాలేరునగరి, మద్రాసు త్రాగునీటి కాలువలకు అవసరమైన నీరు అందడం లేదని ఆందోళనవ్యక్తంచేశారు. గోరుకల్లు, ఆవుకు,గండికోట, వామికొండ, సర్వరాయసాగర్, మైలవరం, చిత్రావతి, పైడిపాలెం, వెలుగోడు, బ్రహసాగర్ రిజర్వాయర్లలో 120 టిఎంసీల సామర్థ్యం ఉన్నప్పటికీ 40 టిఎంసీల నీటినీ తరలించలేని దుస్థితి ఉందని పేర్కొన్నారు. రాయలసీమ హక్కుగాఉన్న నీటిని అందించాల్సిన ప్రభుత్వం, రెగ్యులేటర్ల ప్రవాహాన్ని మార్చి కృష్ణా జలాలను నెల్లూరు వైపు మళ్లిస్తున్నారని విమర్శించారు. ఈ తరహా చర్యల వలన రాయలసీమలో భూసేకరణ, పర్యావరణ నాశనం పెరుగుతుందని హెచ్చరించారు. హంద్రీనీవా, ఎస్సార్ బీసీ, తెలుగుగంగ, గాలేరునగరి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాయలసీమ హక్కుల కోసం ప్రజలు ముందుకు రావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి పిలుపునిచ్చింది ఈ కార్యక్రమంలో మహానంది రెడ్డి సిపిఐ నాయకులు రమేష్ బాబు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలి

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** 65ఏళ్లు పైబడినవృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి డీలర్లు రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలని సివిఎస్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రకళ,డిప్యూటీతహసీల్దార్ వీరేంద్ర గౌడ్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి ఆదేశాల మేరకు రేషన్ డీలర్లతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల వేలి ముద్రలు పడని పక్షంలో ఐరిస్ ద్వారా ఈ పాస్ మిషన్‌లో మోదు చేసుకొని రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. అలాగే యధావిధి గా ఒకటో తేదీ నుండి రేషన్ కార్డుదారుల కు రేషన్ దుకాణాల వద్దే రేషన్ బియ్యం సక్రమంగా పంపిణి చేయాలన్నారు.సరైన సమయానికి రేషన్ దుకాణాలు తెరిచి పంపిణీ చేయాలన్నారు. రేషన్ దుకాణాలు సమయానికి తెరవకుంటే చర్యలు



డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

తప్పవని హెచ్చరించారు.రేషన్‌డీలర్ల సంఘం అధ్య క్షులు సోమల గూడూరుబాషా,రేషన్ డీలర్లు సాజిదుల్లా మన్సూర్‌బాషా, జయన్న, నాగూ ర్ బాషా, సలీం, ఈరన్న, ఫరీద్, రకీబ్, షేక్ ఆహమ్మద్, రాబియా, రాము,నరసింహులు, రామకృష్ణ,నాయుడు పాల్గొన్నారు.

# పంటకాలం కంటే ముందు పంటను కోయరాదు..!

**-ఉల్లి పంటల రైతులకు తహశీల్దార్ వెల్లడి..!**




బెళగల్‌లో ఉల్లి గ్రేడింగ్‌ను పరిశీలించిన తహశీల్దార్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** ఉల్లి రైతులు పంటకాలం కంటే ముందుగా పంటను కోత కొయ్యారాదని మండల తహశీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు.మంగళవారం మండల పరిధిలోని బెళగల్, కంబదహాల్ గ్రామాలలో ఏఓ.మల్లేష్ కుమార్ తో కలసి ఉల్లి పంటలను పరిశీలించారు.అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ మరియు జిల్లా ఉన్నతధికారుల ఆదేశాల మేరకు ఉల్లి పంటలను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు సమర్పించాల్సిన నేపథ్యంలో ఉల్లి పంటలను పరిశీలించడమైందని తహశీల్దార్ తెలిపారు. అందులో భాగంగా రైతులుకు తగు సూచనలు చేశారు. ఉల్లి నారు పోసినది మొదలుకొని నాటు పెట్టిన తరువాత మొత్తం నాలుగు నెలలు పూర్తిగా అయినా తరువాత పంటను పెరికి పది రోజులు ఎండబెట్టాలని అనంతరం కోతకోసి కనీసం వారం రోజులైనా గడ్డను అరనియాలని తర్వాత గ్రేడింగ్ చేసుకొని మార్కెట్ చేసుకోవాలని,అప్పుడే పంట నాణ్యతగాఉండి గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులకు సూచించారు.రైతు సోదరులు నేరుగా ప్రభుత్వ మార్కెట్లలో అమ్ముకోవాలని మధ్యస్తు దళారులనుకు అమ్ముకోరాధని సూచించారు. అదేవిదంగా పంటను ఈపంట నమోదు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తద్వారా రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తహశీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మల్లేష్ కుమార్, మండల సర్వేయర్ నాగభూషణం, గ్రామ వ్యవసాయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారలు మరియు తదితర రైతు సోదరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి..డిఎస్పి రామాంజి నాయక్

**పాములపాడు మేజర్ న్యూస్ :** మండల పరిధి లోనిఎర్రగూడూరు గ్రామంలో జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఎస్సై సురేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాఆత్మకూరుడిఎస్పీరామంజి నాయక్ పాల్గొన్నారు ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా. హెల్మెట్, సీట్ బెల్ట్‌తప్పనిసరిగా వాడాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకూడదని, ఆటోలలో



ఓవర్‌లోడ్ ప్రయాణం చేయరాదని సూచించారు.వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు .ఆన్లైన్ గేమ్స్, లోన్స్, తప్పుడు యాప్‌లు, ఓటీపీ మోసాలు, ఉద్యోగుల పేరుతో జరుగుతున్నాయని ప్రజలకు వివరించారు. దసరా సెలవుల్లో యాత్రలకు వెళున్న వారు తమ విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలని లేదా సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని సూచించారు.మహిళలపై నేరాలు, బాల్యవివాహాలు,దొంగతనాలు,చైన్ స్నాచింగ్‌ల విషయంలో జాగ్రత్తలు వాట్సాప్ మెసేజ్ లలో వస్తున్నాను అవసరమైన లింకులు ఓపెన్ చేసిడబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్

**పత్తికొండ, మేజర్‌న్యూస్ :** గోపాల్, రాజా, రామ్ మోహన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పత్తికొండలో అండర్ 16 టోర్నమెంట్ ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి రమేష్ బాబు, క్రికెట్ కోచ్ అంజిబాబులు పేర్కొన్నారు. మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం కె.జీ కృష్ణమూర్తి చేతులమీదుగా టోర్నమెంట్ బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రికెట్ క్రీడాకారు సహాయసహకారాలతో ఈనెల 29న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ 16 టోర్నమెంట్ నిర్వహించబడునని, టోర్నమెంట్‌లో పాల్గొని తలచిన వారు రూ.1000లు ప్రవేశ రుసుం చెల్లించి క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు శ్రీనివాసులు, బిఎన్‌ఏ ప్రసాద్, కాశీనాథ్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభం

**ప్రారంభించనున్న టిడిపి యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి ప్రారంభించనున్నారని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డా. సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలకు స్క్రీనింగ్, రక్తపోటు, మధుమేహం, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయవ్యాధి స్క్రీనింగ్, కిషోర్ బాలికల ఆరోగ్య పరీక్షలు, వయోవృద్ధుల ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య సేవలు, ఆర్తోపెడిక్ పరీక్షలకు సంబంధించి నిష్ణాతులైన డాక్టర్లతో పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. నేటి నుండి అక్టోబర్ రెండు వరకు ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# కొసనాపల్లి గ్రామంలో రైతు ఆత్మహత్య పై విచారణ

**-తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ.. -సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్**



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలో కోసనపల్లె గ్రామంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల అప్పుల భారముతో గ్రామానికి చెందిన ఎర్ర కేశన్న గారి రామ చంద్రుడు అనే రైతు ఈనెల 14-09-2025 నాడు పురుగు మందు సేవించి బలవన్మరణానికి పాల్పడడం జరిగింది. విషయం తెలుసుకున్న మండల తాసిల్దార్ చంద్రశేఖర్ వర్మ, పత్తికొండ సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్ మంగళవారం కొసనపల్లె గ్రామానికి చేరుకొని రైతు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయము మంజూరు అయ్యేటట్లు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ క్షణికావేశములో రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ అక్బర్ బాష రెవిన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి బివి రమణారెడ్డి,హెచ్ఈఓ ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎస్ డి ఆర్ పాఠశాల విద్యార్థులు ఎంపిక

**నంద్యాలటౌన్,మేజర్‌న్యూస్:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించినటెట్ బాల్ పోటీలలో ఎస్ డిఆర్‌వరల్డ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అండర్-14 విభాగంలో గురు చరణ్, కార్తికేయ రెడ్డి అండర్-17విభాగంలోటి.వినోద్ కుమార్, బి. రితేష్ రెడ్డిరాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ ఎస్‌డిఆర్‌వరల్డ్ స్కూల్ విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, ఇప్పటికే తమ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల పోటీలలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నయూమా , వైస్ ప్రిన్సిపాల్ ఆస్మామరియుకోచ్ ముక్కమల్ల నవీన్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఈ టిలు రాజశేఖర్, సుజాత, తేజస్విని, మహేష్, మహాలక్ష్మి, సతీష్, బాలి రెడ్డి విద్యార్థులను అభినందించారు.




## లక్ష్మీ నగరం గ్రామానికి చెందిన వ్యక్తిపై గుంతకల్లు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు





**వెల్దుర్తి ,మేజర్ న్యూస్ :** అనంతపురం జిల్లా, గుంతకల్లు మండల పరిధిలోని కసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బజాజ్ పల్సర్ 125 సిసి నాలుగు మోటార్ సైకిల్లు చోరీకి గురి కావడంతో వాహనదారులు కసాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలం, లక్ష్మీ నగరం గ్రామానికి చెందిన పింజరి ఖలీల్ కుమారుడు పింజరి షేక్షావలిని అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, గుంతకల్లు డిఎస్పి శ్రీనివాస్ అధ్యక్షతన, కసాపురం పోలీసులు ఈనెల 15-9-2025 వ తేదీన సాయంత్రం ఐదు గంటల సమయంలో ముద్దాయిని పట్టుకొని అతని వద్ద నుండి దొంగలించబడిన పల్సర్ బైక్ ను 4 మోటార్ సైకిల్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

# సాగునీటి కాల్వపై ముళ్ళ కంపను తొలగించిండి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని గంగవరం సెక్షన్ కాలువ ఇరువైపుల దట్టమైన ముళ్ళు కంపతో పాటు పిచ్చి మొక్కలు అలుముకున్నాయి. అయినా ఇరిగేషన్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు అయకట్టు రైతులు తెలిపారు అలాగే కాల్వభూములనుఅక్రమణలకు గురవుతున్నా సాగునీటి సంఘాల అధ్యక్షులు. అధికారులు కూడా పట్టించు కోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కాల్వ గట్టుపై వాముదొడ్లు ఉన్నాయి. కనీసం కాల్వపై నడవడానికి వీలులేని పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. ఏధి ఏమైన ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కాల్వ గట్టు ఇరువైపుల ఉన్న దట్టమైన ముళ్ళు కంపతో పాటు కాలవలో గడ్డిమొక్కలను తొలగించాలని పలువురు రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులను కోరుతున్నారు.

సూర్య www.suryaa.com



# నంద్యాలను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి ఫరూక్‌కే దక్కుతుంది

## – టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**నంద్యాలను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి ఫరూక్‌కే సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల పద్మావతినగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం నాలుగు నెలల్లో పూర్తి చేసిన ఘనత మంత్రి ఫరూక్‌కే దక్కుతుందన్నారు. నంద్యాల మెడికల్ కళాశాల పూర్తయిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమని , మెడికల్ కళాశాల పనులు ఇంకా 70శాతం పూర్తికావాల్సి ఉందని తాము వాటిని పూర్తి చేస్తామన్నారు. మెడికల్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న సమయంలో అక్కడ నేతలతో కలిసి ప్రెస్‌మీట్ పట్టడం దారుణమన్నారు. కేంద్ర నిధులు 17 కళాశాలలకు విడుదల చేస్తే 5 కళాశాలలు కూడా అసంపూర్తిగా పూర్తి చేశారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం మెడికల్ విద్యార్థులు పరీక్షలు రాస్తుంటే మాజీ ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. నంద్యాల మెడికల్ కళాశాలలో వసతులు లేకుండా అసంపూర్తిగా నిర్మాణం చేసి నా హయాంలోనే మెడికల్ కళాశాల పూర్తయిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి అప్పటి వైద్య శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఎన్నో నిధులు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలంటే నిరంతర ప్రక్రియ అని ఏడాదికో, రెండేళ్ళకో పూర్తి కాదన్నారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందుతుందన్నారు. నంద్యాల పట్టణాన్ని దశల వారిగా అభివృద్ధి చేస్తామని ఫిరోజ్ హామీ ఇచ్చారు. ఈసమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది రామచంద్రరావు, కౌన్సిలర్లు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, నాగార్జున, జైనాబి, శ్రీదేవి, మాజీ కౌన్సిలర్లు మధుసాయి, శివశంకర్, కొండారెడ్డి, కృపాకర్, వార్డు ఇన్‌చార్జిలు సాయిరాం, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖలీల్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ మహిళ మృతిపై వైద్యుల వివరణ



మాట్లాడుతున్న వైద్యులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఈ నెల 12న పద్మావతి నగర్ లోని నెరవాటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో గర్భిణీ మహిళ మృతి చెందిన సంఘటనపై ఆసుపత్రి నిర్వాహకులు డా.వినోద్ కుమార్ వివరణ ఇచ్చారు. ఈ నెల 12న హబిబా అనే 20 సంవత్సరాల గర్భిణీ స్త్రీ ప్రసవం కోసం తమ ఆసుపత్రిలో చేరడం జరిగిందని తెలిపారు. స్త్రీ వ్యాధి నిపుణులు గైనకాలజిస్ట్ డా.ఫాతిమా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. డా.వినోద్ కుమార్, డా.ఫాతిమాలు మాట్లాడుతూ సాధారణ ప్రసవం చేసేందుకు అవకాశం లేకపోవడంతో 13వ తేదీ సాయంకాలం సిజిరింగ్ ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీయడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ అనంతరం అకస్మాత్తుగా తల్లి ఆయాస పడటంతో వైద్యం అందించే సమయంలో పరిస్థితి తీవ్రమై అపస్మారక స్థితిలోకి చేరుకుందన్నారు. ఎన్ఐఐటిసి ఆసుపత్రిలో ఐసియులో చికిత్సను అందించినా కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. తమ వద్దకు వచ్చిన రోగికి చక్కటి వైద్యం అందించి బాగుచేయాలనే వైద్యులు భావిస్తారని అన్నారు. రోగి ప్రాణాలు కాపాడేందుకు సాయశక్తులా ప్రయణిస్తామని తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డా.రవికృష్ణ మాట్లాడుతూ రోగి అంతర్గత అవయవాల స్థితిగతలను బట్టి, ఇది వరకే ఉన్న ఆరోగ్య పరిస్థితులు, జబ్బు తీవ్రత బట్టి రోగి మృతి చెందడం జరుగుతుందని అన్నారు. ఇది రోగి కుటుంబ సభ్యులకు తీవ్ర బాధను కలిగిస్తుందని తెలిపారు. అదే విధంగా చికిత్స అందిస్తున్న వైద్యులకు బాధాకరమని అన్నారు. ఎంతో మంది రోగులకు మంచి వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన వైద్యులు ఏదైనా ఒక రోగిని కాపాడలేని పరిస్థితులు నెలకొంటే వెంటనే వారిపై తీవ్ర ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. దుర్భాషలాడటం, దాడులు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. చికిత్సలో లోపం జరిగిందని భావిస్తే రోగి బంధువులు చట్టపరంగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అంతేకాని ఆవేశంతో వైద్యులపై, సిబ్బందిపై దాడులు చేయడం, ఆసుపత్రి ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదని అన్నారు.

# అంతర్రాష్ట్ర పందుల దొంగల ముఠా అరెస్ట్

- 16 మంది అరెస్ట్.. రిమాండుకు తరలింపు
  రూ. 1కోటి 49లక్షలు విలువచేసే
  542 పందులు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఆదోని డీఎస్పీ హేమలత
- వన్ టౌన్ 'సీఐ శ్రీరామ్' పనితీరుకు ఫిదా



మాట్లాడుతున్న ఆదోని డీఎస్పీ హేమలత ప్రక్కన సీఐ శ్రీరామ్.

## అవుతున్న పట్టణ జనం

ఆదోని టౌన్, మేజర్ న్యూస్ : ఈజీ మనీ కోసం దొంగలు రాత్రి పగలు తేడా లేకుండా కొత్త కొత్త పోకడలను అనుసరిస్తున్నారు. చైన్ స్నాచింగ్, నగదు, బంగారం, పశువులను పందులను కూడా దొంగలు వదలడంలేదు. ముఖ్యంగా ఆదోని పట్టణంలో పందుల దొంగతనాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో ఆదోనిలోని పందుల పెంపకందారులకు ఏమాత్రం కంటిమీద కునుకు లేకుండాపోయింది. భారీగా పందులను దొంగలించిన అంతర్ రాష్ట్ర దొంగలు ఇక తమను ఎవ్వరూ పట్టుకోలేరులే అనుకున్నారో ఏమోగాని, ఆదోని పోలీసులకు మాత్రం ఈ మధ్యకాలంలో గట్టి సవాలే విసిరారు. అయితే ఆ సవాల్ ను ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ బాధితుల పక్షాన సీరియస్ గా తీసుకున్నాడు. ఎలాగైనా, దొంగలు ఎక్కడ దాక్కున్నా.. పట్టుకొని పోలీస్ పవర్ ఏంటో వారికి రుచి చూపించాలనుకున్నాడు. వన్ టౌన్ పోలీసు టీంలను రంగంలోకి దింపాడు. ఇంకేముంది పోలీసులకు చిక్కిన దొంగలకు చుక్కలు కనిపించాయి. సీఐ అతని పోలీస్ సిబ్బంది వారిని పట్టుకుని చట్టం ముందు నిలిపారు. అంతేకాదు దొంగలించిన పందులను కూడా రికవరీ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఇన్నాళ్లు దొంగతనాలకు పాల్పడుతూ దొరక్కుండా పోయిన పశువుల దొంగలను ఎట్టకేలకు ఆదోని పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని స్థానిక రెడ్డీస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఈ కేసు వివరాలను ఆదోని డీఎస్పీ హేమలత అందజేశారు. పశువుల దొంగతనాలను అరికట్టాలన్న లక్ష్యంతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాబడిన సమాచార మేరకు.. సోమవారం మాధవరం రోడ్డులోని భారత్ గ్యాస్ గోడౌన్ ఎదురుగా శ్రీ శ్రీనివాస ట్రేడింగ్ %ఏ% జిన్నింగ్ ఫ్యాక్టరీ ఆవరణంలో 16మంది అంతరాష్ట్ర పశువుల దొంగలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వీరినుంచి దాదాపు రూ. కోటి 49లక్షల 33వేలు మార్కెట్ విలువచేసే 542 పందులను స్వాధీనం చేసుకున్నాం. అలాగే రెండు బొలెరో వాహనాలతో పాటు మారణాయుధాలు కూడా సీజ్ చేశాం. నిందితులదంతా కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరుకి చెందినవారు. సులభంగా డబ్బులు సంపాదించుకోవాలన్న దురుద్దేశంతో పశువుల దొంగతనాలకు పాల్పడడం వీరి ప్రవృత్తిగా మార్చుకున్నారు. ఆదోని పట్టణంలో పందులు ఎక్కడ ఉంటాయో పక్కాగా ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకొని ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చి పందులను బొలెరో వాహనంలో ఎక్కించుకుని పరారయ్యే వారు. పందులు అరుపులు విని కాపలాదారులు వెంటపడితే ఇనుప రాడ్లు, కత్తులు వంటి మారణాయుధాలతో భయభ్రాంతులకు గురిచేయడమేగాక విచక్షణారహితంగా దాడులకు తెగబడి దొంగలు తప్పించుకునేవారు. వీరిపై అనేక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు కూడా ఉన్నాయని వివరించారు. ఆదోని డివిజన్ పరిధిలో దాదాపు 40కి పైగా వీరిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులకు సంబంధించిన మొత్తం 25 మంది ముద్దాయిలలో ప్రస్తుతం 16 మంది పట్టుపడగా, మరో 9 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కేసును వన్ టౌన్ సీఐ శ్రీరామ్, ఎస్ఐ, పోలీసు సిబ్బంది ఎంతో చాకచక్యంగా ఛేదించారని డీఎస్పీ ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఎవ్వరూ సంచరించని రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతూ అడ్డొచ్చిన వారిపై అతి కిరాతకంగా దాడికి పాల్పడడం లేదా ప్రాణాలు తీయడానికి కూడా ఏమాత్రం వెనుకాడని కరడుగట్టిన దొంగలను పట్టుకున్న వన్ టౌన్ సీఐపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ఆదోని పట్టణంలో బెట్టింగులు, అక్రమ సారా తయారీ, దొంగతనాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడుతూ మంచి పోలీస్ అధికారిగా ఉన్న ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ పనితీరుపై పోలీస్ ఉన్నత అధికారుల నుంచే గాక, ఆదోని ప్రజల నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రశంసలు దక్కుతున్నాయి.

# 440 గ్రాముల గంజాయి పట్టివేత

## – ఇద్దరు అరెస్టు



గంజాయి, వాహనాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు



ఇన్‌సైడ్‌లో గంజాయి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పంచ లింగాల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా బొలోరో వాహనంలో 440గ్రాముల గంజాయిని పట్టుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ చంద్రహాస్ తెలిపారు. మంగళవారం పంచలింగాల వద్దనున్న అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ బొలోరో వాహనంలో పంచలింగాల గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాసులు గౌడ్, చైతన్య నగర్‌కు చెందిన శ్రీకాంత్‌ల వద్ద నుండి 44ప్యాకెట్లలో ఒక్కో ప్యాకెట్‌లో 10గ్రాములు చొప్పున ఉన్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నింధితులను అరెస్టు చేసి, బొలోరో వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి విలువ దాదాపు రూ.22వేలు ఉంటుందన్నారు. పాత నేరస్తుడైన ఈడిగ శ్రీనివాసులు గౌడ్ ఇతర ప్రాంతాల నుండి గంజాయిని తీసుకొచ్చి ప్యాకెట్లను తయారు చేసి నగరంలో పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది దుర్గా నవీన్ బాబు, రామయ్య, చంద్రపాల్, రామలింగయ్య, సుందర్‌రాజులు పాల్గొన్నారు.

# రైతుల గోడు పట్టని ప్రభుత్వం

## – టమోటో, ఉల్లి రైతులను ఆదుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** టమోటా, ఉల్లి పంటకు గిట్టుబాటుధర లేక పూర్తిగా ధర పడిపోయిందని, రైతులు గోడు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ విమర్శించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్లో టమోటోను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ, జత గంపలు రూ.70ల నుండి 200లు దాకా కొనుగోలు చేస్తున్నారని, అలాగే 25కేజీలు జత టమోటా బాక్సులను 250నుండి 500దాక కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. గత వారంలో కనీసం కిలో టమోటా రెండు రూపాయలు కూడ కొనుగోలు చేయలేదని రైతులు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, టమోటాకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేలా రైతుల అండగా పోరాడుతామని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి పంటను దున్నివేస్తున్న పులికొండ, కొత్తిమీర, నెట్టేకల్ అనే రైతులకు చెందిన పొలాన్ని పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులకు విత్తనం వేసిన నాటి నుండి పంటను విక్రయించేదాక జగనన్న అండగా ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, మాజీ సర్పంచులు సోమశేఖర్, రెహమాన్, బనగాని శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 20న ఉమామహేశ్వరుల కళ్యాణం



**బనగానపల్లె రూరల్ మేజర్,న్యూస్ :**

ఈ నెల 20వ తేదీ శనివారంనాడు మాస శివరాత్రి సందర్భంగా యాగంటి ఉమా మహే శ్వరస్వామి దేవస్థానం నందు 6:30 నిముషాలకు శ్రీ ఉమామహేశ్వరుల కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈ.ఓ డి. పాండు రంగారెడ్డి తెలిపారు. ఈ కళ్యాణం చేయించదలచిన వారు కార్యాలయం నందు సంప్రదించవచ్చునన్నారు. మాస శివరాత్రి సందర్భంగా జరిగే కళ్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు తెలియజేశారు.